
చిలుక, దొంగ




అనగనగా సముద్ర తీర గ్రామంలో ఒక వ్యక్తి ఏ పని చెయ్యలేక దొంగగా మారాడు. ఆ ఊరి రేవుకి దూర దూర ప్రాంతాల నుంచి ఓడలు వచ్చేవి. ఒక రోజున ఆ దొంగకి ఆ రేవు దగ్గర పంజరంలోని చిలక ఒకటి దొరికింది.
ఆ చిలక వల్ల అతనికి ఏ ఉపయోగం లేదు. అయినా, అది మాట్లాడే చిలక కాబట్టి దాచి ఉన్న ఏదైనా నిధి గురించి చెపుతుందేమోనని దానిని ఇంటికి తీసుకుని వెళ్లాడు.



దొంగ ఆ పంజరంతో ఇంటికి వచ్చాడు. అదే రోజు అతను పక్కింటి వ్యక్తి గొర్రెను దొంగలించి, చంపాడు. కొంత మాంసం వండుకుని తిని, మిగిలిన మాంసం కొట్టంలో దాచాడు.


ఆ రోజు సాయంత్రం పక్కింటి వ్యక్తి తన గొర్రెను వెతుక్కుంటూ వచ్చి దానిని చూశావా అని దొంగని అడిగాడు. చూడలేదని దొంగ చెప్పాడు. కానీ తన అసలైన యజమానిని చేరుకుని, అతనితో ఓడ మీద సముద్రయానం చేయాలని ఉన్న చిలక కల్పించుకుని, "గొర్రెను అతనే చంపాడు. కొంత మాంసం కొట్టంలో దాచాడు," అని చెప్పింది.

చిలక చెప్పినట్టే పక్కింటి వ్యక్తికి కొంత మాంసం కొట్టంలో దొరికింది. కానీ దొంగ, "ఈ పిచ్చి చిలక ఎప్పుడూ అబద్ధాలు చెపుతుంది," అన్నాడు. అయితే చిలక ఊరుకోక, "గొర్రెను అతనే చంపాడు. కొంచెం మాంసం కొట్టంలో దాచాడు!" అని మళ్లీ చెప్పింది. ఆ వ్యక్తి మాటలు, చిలక మాటల మధ్య ఎటూ తేల్చుకోలేక పక్కింటి వ్యక్తి న్యాయం కోసం వెళ్లగా మరునాడు విచారణ జరుపుతామని చెప్పారు.



ఆ రాత్రికి చిలకని దొంగ ఒక పీపాలో ఉంచి పైన గుడ్డతో గట్టిగా కట్టేశాడు. రాత్రంతా గుడ్డ మీద నీళ్లు పోస్తూ, పీపాని కట్టెతో కొడుతూ ఉన్నాడు. దాంతో చిలకకి ఉరుములు, మెరుపులతో వాన పడుతున్నట్టు అనిపించింది. వాస్తవానికి ఆ రాత్రి మనోహరంగా ఉండి, చంద్రుడు, తారలతో మెరుస్తూ ఉంది. కానీ పీపా లోపల ఉన్న చిలకకి ఆ విషయం తెలియదు. తెల్లవారిన తరవాత చిలకని ఆ దొంగ పీపా నుంచి తీసి, పంజరంలో పెట్టి సాక్షిగా న్యాయస్థానానికి తీసుకుని వెళ్లాడు.





న్యాయస్థానంలో గొర్రె గురించి చెప్పమనగా చిలక అంతకుముందు లాగానే, "గొర్రెను అతనే చంపాడు. కొంచెం మాంసం కొట్టంలో దాచాడు," అని చెప్పింది. చిలక చెప్పింది అందరూ నమ్మసాగారు.

కానీ ఆ దొంగ, "ఒక చిలక మాట నమ్మి నన్ను దొంగ అంటారా? నాకు ఆ గొర్రె గురించి ఏమీ తెలియదు. ఆ చిలకని నిన్న రాత్రి ఎలా ఉందన్న మరో ప్రశ్న అడిగి చూడండి," అన్నాడు.


చిలకని అదే ప్రశ్న అడిగారు. రాత్రి భయంకరమైన డమడమ శబ్దాలు, చినుకులు గుర్తుకు వచ్చిన చిలక, "క్రితం రాత్రి ఉరుములతో తుఫాను చెలరేగింది," అని చెప్పింది.

దాంతో అక్కడ ఉన్న వాళ్లు, "ఈ చిలక మాటలు నమ్మటానికి లేదు!" అన్నారు. చిలక తోపాటు ఆ దొంగని వదిలి పెట్టేశారు.

అదే రోజు ఆ దొంగ ఇంకొక పక్కింటి వ్యక్తి కోడిని దొంగిలించాడు. దానిని చంపి, కూర వండుకుని తినేశాడు. దాని ఈకలు, ఎముకలు ఇంటి బయట, పంపు పక్కన మట్టిలో పూడ్చి పెట్టాడు.

తన కోడిని వెదుక్కుంటూ వచ్చిన పక్కింటామె దాని గురించి దొంగను అడిగింది. "నేను నీ కోడిని చూడలేదు," అని దొంగ చెప్పాడు. కానీ చిలక, "కోడిని అతనే చంపి, కూర వండుకుని తినేశాడు. దాని ఈకలు, ఎముకలు ఇంటి బయట, పంపు పక్కన మట్టిలో పూడ్చి పెట్టాడు," అని చెప్పింది.

చిలక చెప్పినట్టే పక్కింటి ఆమెకి ఈకలు, ఎముకలు ఇంటి బయట, పంపు పక్కన మట్టిలో కనిపించాయి. కానీ దొంగ, "ఈ పిచ్చి చిలక ఎప్పుడూ అబద్ధాలు చెపుతుంది," అన్నాడు. అయితే చిలక ఊరుకోక, "కోడిని అతనే చంపాడు. ఈకలు, ఎముకలు ఇంటి బయట, పంపు పక్కన మట్టిలో పూడ్చిపెట్టాడు!" అని మళ్లీ చెప్పింది. ఆ వ్యక్తి మాటలు, చిలక మాటల మధ్య ఎటూ తేల్చుకోలేక పక్కింటి ఆమె న్యాయం కోసం వెళ్లగా మరునాడు విచారణ జరుపుతామని చెప్పారు.





ఆ రాత్రికి చిలకని దొంగ ఒక డబ్బాలో ఉంచి పైన చిల్లుల మూత పెట్టాడు. ఆ డబ్బా చుట్టూ మంచు ముక్కలు పెట్టి ఉంచి రాత్రంతా చల్లటి గాలి డబ్బాలోకి వెళ్లేలా విసురుతున్నాడు. దాంతో లోపల ఉన్న కొద్దిపాటి నీళ్లు గడ్డ కట్టుకుని పోయాయి. ఆ రాత్రి మనోహరంగా ఉండి, చంద్రుడు, తారలు మెరుస్తూ ఉన్నాయి. కానీ, పీపా లోపల ఉన్న చిలకకి ఆ విషయం తెలియదు. తెల్లవారిన తరవాత చలికి గడ్డ కట్టుకుని పోతున్న చిలకని ఆ దొంగ డబ్బా నుంచి తీసి పంజరంలో పెట్టి సాక్షిగా న్యాయస్థానానికి తీసుకుని వెళ్లాడు.





న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పమని చిలకని అడగగా అంతకుముందు లాగానే చెప్పింది, "కోడిని అతనే చంపి, కూర వండుకుని తినేశాడు. దాని ఈకలు, ఎముకలు ఇంటి బయట, పంపు పక్కన మట్టిలో పూడ్చి పెట్టాడు." అందరికీ చిలక చెప్పింది నిజమనే అనిపించసాగింది. కానీ ఆ దొంగ, "ఈ పక్షిని నమ్మటానికి లేదు. నాకు ఈకలు, ఎముకలు గురించి ఏమీ తెలియదు. ఒక చిలక అబద్ధాలు నమ్మి నన్ను కారాగారానికి పంపించరు కదా? ఆ చిలకని మరో ప్రశ్న అడగండి. నిన్న రాత్రి ఎలా ఉందని అడిగి చూడండి," అన్నాడు.


చిలకని అదే ప్రశ్న అడిగారు. క్రితం రాత్రి చలి గాలులు గుర్తుకు వచ్చిన చిలక, "రాత్రి చాలా చల్ల గాలులు వీచాయి, నీళ్లు గడ్డ కట్టుకుని పోయాయనుకోండి," అని చెప్పింది. దాంతో అక్కడ ఉన్న వాళ్లు తలలు ఊపుతూ, "ఈ చిలక మాటలు నమ్మటానికి లేదు!" అన్నారు. ఆ దొంగని వదిలిపెట్టేశారు. అతను తన చిలకను తీసుకుని వెళ్లిపోయాడు.

అదే రోజు ఆ దొంగ మరొక పక్కింటి వ్యక్తి పందిని దొంగిలించాడు. దానిని చంపి, కొంత మాంసం వండుకుని తిని, మిగిలినది కట్టెల దొడ్డిలో దాచిపెట్టాడు. ఆ పక్కింటి వ్యక్తి తన పందిని వెతుక్కుంటూ వచ్చి దానిని చూశావా అని దొంగని అడిగాడు. చూడలేదని దొంగ చెప్పాడు. కానీ చిలక ఊరుకోకుండా, “పందిని అతనే చంపాడు. కొంత మాంసం వండుకుని తిని కొంత కట్టెల దొడ్డిలో దాచాడు,” అని చెప్పింది.

చిలక చెప్పినట్టే పక్కింటి వ్యక్తికి కొంత మాంసం కట్టెల దొడ్డిలో దొరికింది. కానీ దొంగ, “నేను పందిని దొంగలించ లేదు. ఈ పిచ్చి చిలకకి నిజం ఏమిటో తెలియదు,” అన్నాడు. “పందిని అతనే చంపాడు. కొంత మాంసం కట్టెల దొడ్డిలో దాచాడు!” అని చిలక మళ్లీ చెప్పింది.

ఇప్పుడు న్యాయ స్థానమే తీర్పు చెప్పాలని పక్కింటి వ్యక్తి అన్నాడు. విచారణ మరునాడు జరుగుతుందని చెప్పారు.





ఆ రాత్రి చిలకని పెద్ద వంట పాత్రలో పెట్టి రాత్రంతా మంట పెట్టటానికి కట్టె పుల్లలను దొంగ ఏర్పాటు చేస్తున్నాడు. ఆ రాత్రి ఎలా ఉందని చిలకని అడిగితే తీవ్ర వేసవిలో కంటే చాలా వేడిగా ఉందని చిలక చెప్పాలని అతని ఆలోచన. అయితే, దొంగ చేస్తున్నదంతా చిలక కిటికీ లోంచి చూసేసింది. దాంతో గత రెండు రాత్రులు ఏమి జరిగి ఉంటుందో అది ఊహించుకుంది, న్యాయ స్థానంలో తన మాటలను ఎవరూ ఎందుకు నమ్మలేదో దానికి అర్థమయ్యింది. చిలకని మోసం చెయ్యటానికి అన్ని ఏర్పాట్లు చేసిన తరవాత ఆ దొంగ దానిని పంజరం లోంచి తీసి, పాత్రలో ఉంచి, మూత పెట్టాడు. తరవాత కట్టె పుల్లలు వెలిగించి గంట పాటు సన్నని మంట మండేలా చూశాడు. మిగిలిన పనిని నిప్పు కణికలు చేస్తాయనుకుని అతను హాయిగా నిద్ర పోయాడు.




పాత్ర లోపల చిలకకి చాలా ఇబ్బందిగా ఉంది. అయితే, ఆ దొంగ అక్కడి నుంచి వెళ్లిపోయే అలికిడి కోసం జాగ్రత్తగా వింటూ ఉంది. అతను అక్కడి నుంచి వెళ్లి పోయిన తరవాత పాత్ర మూతను పక్కకి తప్పించి చిలక బయటకు ఎగిరింది. ఆ రాత్రి ఎంతో మనోహరంగా ఉంది, చంద్రుడు, తారలతో మెరుస్తూ ఉంది.

చిలక ఎగిరి ఇంటి కప్పు మీద కూర్చుని, రాత్రంతా తన అసలైన యజమాని అయిన నావికుని వద్ద నేర్చుకున్న అన్ని రకాల నాట్యాలు చేస్తూ గడిపింది. దొంగ నిద్రిస్తున్న గది రేకుల కప్పుపై అది నాట్యం చెయ్యటం వల్ల డబడబ శబ్దం అవుతూనే ఉంది.

తెల్లవారబోతుండగా అది కిందకి వచ్చి, పాత్ర లోపలికి వెళ్లి, మళ్లీ మూతను యధా స్థానంలోకి లాగింది.

రాత్రి అంతా రేకుల కప్పు శబ్దాలకు సరిగా నిద్ర పట్టని దొంగ మరునాడు ఆలస్యంగా లేచాడు. చిలకని పంజరంలో పెట్టి న్యాయ స్థానానికి మళ్లీ తీసుకుని వెళ్లాడు.





ప్రజలకి ఇప్పుడు చిలక మాటలు నమ్మదగినవిగా అనిపించటం లేదు. అయినా దాని సాక్ష్యాన్ని శ్రద్ధగా విన్నారు: "అతను పందిని చంపి కొంత మాంసం కట్టెల దొడ్డిలో దాచి ఉంచాడు." అప్పుడు దొంగని అతను చెప్పుకోవలసింది ఏమైనా ఉందా అని అడిగారు.

"ఈ పిచ్చి చిలక మాటలు నమ్మి నన్ను జైలుకి పంపించలేరు," ఎంతో ఆత్మవిశ్వాసంతో దొంగ చెప్పాడు. "పంది మాంసం కట్టెల దొడ్డిలోకి ఎలా వచ్చిందో నాకు తెలియదు. నిన్న రాత్రి ఎలా ఉందన్న మరో ప్రశ్నని ఈ చిలకని అడిగి చూడండి. అప్పుడు దాని మాటలు నమ్మవచ్చో, లేదో తెలుస్తుంది."

న్యాయ స్థానం అడిగిన ప్రశ్నకి చిలక, "రాత్రి మనోహరంగా ఉంది, చంద్రుడు, తారలు, మెరుస్తూ ఉన్నాయి," అని చెప్పింది. అది నిజమే.



రాత్రి అంతా పాత్రలో వేడికి బాగా ఇబ్బంది పడి ఉంటుందనుకున్న చిలక అలా చెప్పటంతో దొంగ ఆశ్చర్యపోయాడు. అయినా అతడు ఏమీ కంగారు పడకుండా, "చూశారా? దీని మాటలు నమ్మటానికి లేదు. రాత్రంతా వడగళ్లు పడుతూనే ఉన్నాయని అందరికీ తెలుసు! మా ఇంటి రేకుల మీద అవి చేసిన శబ్దాలకు నాకు నిద్ర కూడా సరిగా పట్టలేదు," అన్నాడు.

అతని మాటలు విని ఆశ్చర్యపోవటం న్యాయమూర్తి వంతు అయ్యింది. న్యాయస్థానంలో ఉన్న వాళ్లందరూ, "ఇతని మాటలు నమ్మటానికి లేదు. ఇతనే దొంగ! ఇతడిని కారాగారంలో బంధించండి," అంటూ అరవసాగారు.

దాంతో దొంగని బందిఖానాకి పంపించారు. చిలక తన కథ చెప్పటంతో దానిని దొంగలించుకుని వచ్చిన ఓడ రేవుకి తీసుకుని వెళ్లారు. చిలక అసలైన యజమాని అయిన నావికుడు అది పోయిందన్న విచారంలో ఉన్నాడు. దానిని చూడటంతోనే ఎంతో సంతోషంగా తన భుజం మీద కూర్చోబెట్టుకున్నా . ఆ సాయంత్రం వాళ్లు సుదూర ప్రాంతాలకు ఓడ మీద బయలు దేరారు.

అయిపోయింది



